క్లుప్తంగా

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ



వనపర్తి రూరల్: మండలంలోని చిట్యాల తూర్పుతండా ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఎంఈఓ మద్దిలేటి ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదిలో విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సామర్థ్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ పాటిస్తూ నాణ్యతగా అందించాలని ప్రధానోపాధ్యాయుడు జైపాల్‌రెడ్డికి సూచించారు. విద్యార్థులు పాఠశాలకు క్రమం తప్పకుండా వచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.

22న వైద్య శిబిరం

వనపర్తి రూరల్: మండలంలోని పెద్దగూడెం శివారు తిరుమలయ్యగుట్ట సమీపంలో ఉన్న రేడియంట్ పాఠశాలలో ఆదివారం పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ గద్దె భాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని కిమ్స్, ఎల్వీ ప్రసాద్, గ్రేస్ కార్పొరేట్ ఆస్పత్రుల నుంచి సుమారు 40 మంది వైద్యులు వస్తారని వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులు అందజేస్తారని పేర్కొన్నారు. రక్తదాన శిబిరం కూడా ఉంటుందని దాతలు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



ఆత్మకూర్: ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. శుక్రవారం రాత్రి మండలంలోని రేచింతల ఊకచెట్టువాగు నుంచి ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఆరేపల్లి శివారులో పట్టుకున్నామన్నారు. వాహనాన్ని సీజ్ చేసి డ్రైవర్ బాలవర్ధన్, యజమాని మొగులయ్యపై కేసు నమోదు చేశామని చెప్పారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ



ఆత్మకూర్: పట్టణంలోని భార్గవీనగర్‌లో పుర చైర్‌పర్సన్ రవికుమార్ గృహంలో శుక్రవారం అయ్యప్పస్వామి పడిపూజ వైభవంగా జరిగింది. వేదపండితుడు గోపాలకృష్ణ గురుస్వామి స్వామివారికి అభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమరచింత, ఆత్మకూర్, మదనాపురం, చింతకుంట తదితర ప్రాంతాల్లోని అయ్యప్ప మాలధారులు భారీగా తరలివచ్చారు.

28 నుంచి 31 వరకు ఆన్‌లైన్ సేవలు బంద్



ఏపీజీవీబీ ఆర్‌ఎం రవికిషోర్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సేవల విభాగం (డీఎఫ్‌ఎస్) జారీ చేసిన ఉత్తర్వు ప్రకారం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ (ఏపీజీవీబీ) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో తమ కార్యకలాపాలను విభజించడం జరుగుతుందని బ్యాంకు రీజినల్ మేనేజర్ ఎ.రవికిషోర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని 493 ఏపీజీవీబీ శాఖలు వచ్చేనెల 1వ తేదీ నుంచి హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఉన్న తెలంగాణ గ్రామీణ బ్యాంక్ (టీజీబీ)లో విలీనం చేయనున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో విలీన ప్రక్రియలో ఏర్పడే సాంకేతిక సమస్యల కారణంగా ఈనెల 28వ తేదీ నుంచి 31 వరకు అన్ని శాఖల్లో బ్యాంకింగ్ సేవలు, ఆన్‌లైన్ లావాదేవీలు (యూపీఐ, ఏటీఎం, మొబైల్ బ్యాంకింగ్) అందుబాటులో ఉండవని పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, తిరిగి బ్యాంకింగ్ సేవలు వచ్చేనెల 1వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఖాతాదారులందరూ మాకు సహకరించి ఆర్థిక లావాదేవీలను ఈనెల 27వ తేదీలోగా పూర్తి చేసుకోవాలని విజ్ఞప్తి. రాష్ట్రంలోని ఏజీవీబీ శాఖలకు సంబంధించిన ఖాతాదారులు ఏటీఎం కార్డు మార్చుకునేందుకు, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ సేవలు, యూపీఐ సేవలను తిరిగి రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి వచ్చేనెల 1వ తేదీ నుంచి మీ శాఖను సంప్రదించాలని కోరారు. ఖాతాదారులకు మరింత విలువైన సేవలు అందించడానికి సంసిద్ధంగా ఉంటామని చెప్పారు.

ఆగని గుడిసెల పోరు



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు ద్యావర్ల మణెమ్మ. అప్పట్లో ప్రభుత్వం ఇచ్చిన ఇంటి పట్టా ప్రకారం స్థలం చూపాలంటూ కొన్ని నెలలుగా దుంపాయికుంటలో గుడిసె వేసుకొని ఉంటూ బీడీలు చుడుతూ జీవనం సాగిస్తోంది. అధికారులు పరిశీలనకు వచ్చినప్పుడు తాను లేకపోతే ఇంటి పట్టా రద్దు చేస్తారనే భయంతో ఇక్కడే ఉంటూ బీడీలు చుడుతూ కాలం వెళ్లదీస్తోంది.

- దుంపాయికుంటలో ఇంటి స్థలాల్లోనే గుడిసెలు వేసుకొని నివాసాలు
- విషపు పురుగుల సంచారంతో భయాందోళనలు
- 27 నెలలుగా కొనసాగుతున్న ఆందోళన



దుంపాయికుంటలో పేదలు నిర్మించుకున్న గుడిసెలు

అమరచింత: పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చేందుకు 1997లో అప్పటి ప్రభుత్వం అమరచింతలోని దుంపాయికుంటలో సర్వేనంబర్ 586, 587లో 14 ఎకరాల భూమిని కొనుగోలు చేసి సుమారు 350 మందికి ఇంటి స్థలం పట్టాలు అందజేసింది. పట్టాలిచ్చిన అధికారులు హద్దులు చూపించలేదు. దీంతో లబ్ధిదారులు తమ ఇంటి స్థలాలు ఎక్కడున్నాయో చూపించాలంటూ అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో తమకు ఇచ్చిన ఇంటి పట్టాలకు స్థలాలు చూపాలంటూ 2022, సెప్టెంబర్ 6న సీపీఎం మద్దతుతో లబ్ధిదారులు గుడిసెల పోరుకు శ్రీకారం చుట్టారు. తమకు న్యాయం చేయాలంటూ 27 నెలలుగా అక్కడే గుడిసెలు వేసుకొని ఉంటున్నారు. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో మరోమారు తమ పోరును ఉధృతం చేయడానికి సిద్ధమవుతున్నారు. ఇటీవల కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీకి వచ్చిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని కలిసి తమ సమస్యను పరిష్కరించాలని విన్నవించినా ఫలితం లేకపోవడంతో పోరాటాలతోనే తమ ఇంటి స్థలాలను దక్కించుకుంటామంటూ లబ్ధిదారులు మరోమారు గుడిసెల నిర్మాణ పనుల్లో నిమగ్నమయ్యారు.

సర్వేలకే పరిమితం..

దుంపాయికుంటలో అప్పటి ప్రభుత్వం 280 మందికే ఇంటి పట్టాలు ఇచ్చిందంటూ వివరాలు సేకరించిన అధికారులు నెలకోమారు సర్వే అంటూ కాలయాపన చేశారు. గత కలెక్టర్ తేజస్ నంద్లాల్‌పవార్ త్వరగా సర్వేచేసి నిజమైన లబ్ధిదారులు ఎవరన్న విషయాన్ని వెల్లడించాలని ఆదేశించినా రెవెన్యూ అధికారులు తగిన నివేదిక సమర్పించకపోవడంతో సమస్య అలాగే మిగిలిందని గుడిసెల పోరు లబ్ధిదారులు అంటున్నారు.

ఇల్లు లేక ఇబ్బందులు..



సొంత ఇల్లు లేక అద్దె ఇంట్లో ఉంటూ జీవనం సాగించేవారం. ఇంటి పట్టాలు ఇచ్చినా స్థలం చూపకపోవడంతో ఇక్కడే గుడిసె వేసుకొని జీవిస్తున్నా. అధికారులు స్పందించి ఇల్లు మంజూరు చేయాలి.

– మహిమూదాబేగం, అమరచింత

27 నెలలుగా ఇక్కడే..



ఉన్న ఇల్లు వర్షాలకు దెబ్బతింది. దీంతో మాకు ఇచ్చిన ఇంటి పట్టా ప్రకారం స్థలం చూపించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం న్యాయం చేస్తుందని ఆశించినా ఫలితం లేకపోయింది. ఇక చేసేది లేక రూ.15 వేలతో గుడిసే వేసుకున్నా. వర్షానికి దెబ్బతినడంతో మరోమారు చీరతో గుడారం వేసుకున్నా.

– పద్మ, అమరచింత

లబ్ధిదారుల జాబితా సిద్ధం చేస్తున్నాం..



దుంపాయికుంట లబ్ధిదారుల వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు అందించేందుకు జాబితా సిద్ధం చేస్తున్నాం. గత తహసీల్దార్లు సర్వే పూర్తి చేశారు. ఎమ్మెల్యే సూచన మేరకు సర్వే దస్త్రాన్ని మరోమారు పరిశీలించి, జాబితాను సిద్ధం చేసి అందజేస్తాం.

– రవికుమార్, తహసీల్దార్, అమరచింత

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఆందోళన చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు

కొత్తకోట: సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు మొగిలి డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని అమడబాకుల కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల ఎదుట విద్యార్థినులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష ఉద్యోగుల వారం రోజులుగా సమ్మె చేస్తున్నారని, బోధన సిబ్బంది సమ్మెలో పాల్గొనడంతో విద్య కుంటుపడుతోందని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి తరగతులు యథావిధిగా కొనసాగేలా చూడాలని కోరారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు భద్రత కల్పించి కనీస వేతనం, పేస్కేలు అమలు చేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రతి ఉద్యోగికి రూ.10 లక్షల జీవిత బీమా, రూ.5 లక్షల ఆరోగ్యశ్రీ బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకుడు నిఖిల్, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం నేతల నిరసన



ఆందోళన చేస్తున్న బీజేవైఎం నాయకులు

అమరచింత: పార్లమెంట్‌లో రాహుల్‌గాంధీ తోటి ఎంపీలపై దాడి చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో బీజేవైఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టి రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి మంత్రి సుధీర్, రాష్ట్ర అధికార ప్రతినిధి కదిరె మధు, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మనోహర్‌గౌడ్ మాట్లాడుతూ.. ఏఐసీసీ జాతీయ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను అవమానపర్చి పార్లమెంట్ సాక్షిగా తోటి సభ్యులపై దాడి చేయడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా వారికి బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు మేర్వరాజు, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి బిట్లి రాజశేఖర్‌యాదవ్, హరి అశోక్‌నంద, అశోక్ భూపాల్, సందీప్, ప్రశాంత్, నాని, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాదాత సంత్ గాడ్గే బాబా



నినాదాలు చేస్తున్న స్ఫూర్తి వేదిక నాయకులు

వనపర్తి టౌన్: స్థానిక కేడీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో శుక్రవారం సంత్ గాడ్గే బాబా వర్ధంతిని మహనీయుల స్ఫూర్తి వేదిక ఆధ్వర్యంతో నిర్వహించారు. ఈ సందర్భంగా సంత్ గాడ్గేబాబా చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వేదిక రాష్ట్ర చైర్మన్, ప్రజా వాగ్గేయకారుడు రాజారాంప్రకాష్ మాట్లాడుతూ.. భారతదేశం గర్వించదగ్గ మహా వ్యక్తుల్లో గాడ్గే బాబా ఒకరని కొనియాడారు. పీడిత జాతుల్లో అజ్ఞాన అంధకారాన్ని తొలగించడానికి ఎన్నో పాఠశాలలు ఏర్పాటు చేశారని, పరిశుభ్రత, అంటరానితనంపై పోరాటాలు చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో చిలుక రవి, మండ్ల దేవన్ననాయుడు, బండలయ్య, కుర్మయ్య, శివశంకర్, బాలేమియా, నర్సింహ, రమేశ్‌చారి, సతీశ్ తదితరులు ఉన్నారు.

క్షయపై అవగాహన



పాన్‌గల్: మండలంలోని కేతేపల్లిలో శుక్రవారం వైద్యసిబ్బంది క్షయపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ధూమపానం చేసే వారికి ఈ వ్యాధి సోకుందని.. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, తెమడలో రక్తం పడటం, అలసట, రాత్రిళ్లు చెమటలు పట్టడం, స్వల్ప కాలంలో బరువు తగ్గడం, శరీరంలో మార్పులు కనిపిస్తాయన్నారు. వ్యాధిగ్రస్తులు బయట తిరగరాదని, ఉమ్మి రాదని సూచించారు. క్రమం తప్పకుండా ఆరు నెలలు పాటు మందులు వాడితే రోగం నయం అవుతుందని.. నిక్షయ్ పోషణ యోజన కింద బలవర్ధక ఆహారం తీసుకునేందుకు వ్యాధి తగ్గేవరకు నెలకు రూ.వెయ్యి అందిస్తారన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య, రాంచందర్, సుమనశ్రీ, శ్రీలక్ష్మి, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంఈఓకు ఆత్మీయ వీడ్కోలు



పాన్‌గల్: మండలంలో విద్యాభివృద్ధి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ విశేష కృషి చేశారని పలువురు కొనియాడారు. బదిలీపై వెళ్లిన లక్ష్మణ్‌నాయక్ వీడ్కోలు సమావేశం శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించగా వివిధ పాఠశాలల జీహెచ్‌ఎంలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మండలంలో ఎంఈఓగా సుదీర్ఘ కాలం విధులు నిర్వహించారని.. ప్రతి ఉద్యోగికి బదిలీ, ఉద్యోగ విరమణ తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

గద్వాల క్రైం: ఓ మైనర్ కారును ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ఎదురుగా ఉన్న కారు, స్కూటీ, స్తంభాన్ని ఢీ కొట్టిన సంఘటన శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ఇటిక్యాల మండలానికి చెందిన కారును ఓ మైనర్ పట్టణంలోని పాత హౌసింగ్ బోర్డు కాలనీ వైపు వేగంతో నడిపాడు. ఈ క్రమంలో ప్రైవేటు పాఠశాల సమీపంలో ఇంటి ముందు పార్క్ చేసిన కారును, స్కూటీని ఢీ కొట్టాడు. అంతటితో ఆగక కేబుల్ వైర్ స్తంభాన్ని ఢీ కొన్ని ఆగిపోయింది. దీన్ని గమనించిన స్థానికులు కారు వద్దకు వెళ్లగా, డ్రైవింగ్ చేసింది మైనర్‌గా గుర్తించి పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. మైనర్, కారు యజమాని బజారన్న హౌసింగ్ బోర్డు కాలనీలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్ ఇంటికి పని నిమిత్తం వచ్చారు. ఈ క్రమంలో మైనర్ కారును బయటకు తీశాడు. కారును స్పీడ్‌గా నడపడం, బ్రేక్‌లు వేసే క్రమంలో ఎక్స్‌లేటర్‌ను తొక్కడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో ఫార్చునర్ కారు, స్కూటీ పాక్షికంగా దెబ్బతిన్నాయి. ప్రమాదానికి గురైన కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. దెబ్బతిన్న వాహనాల మరమ్మతు కారు యజమాని చేయిస్తానని చెప్పడంతో శాంతించారు. ఈ ప్రమాదంపై పోలీసులను సంప్రదించగా ప్రమాదం జరిగిన సంఘటనపై విచారణ చేస్తామన్నారు. మైనర్ కావడంతో పలువురు మందలించారు.



ప్రమాదానికి కారణమైన కారు

కందులు క్వింటా రూ.7,769

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో శుక్రవారం జరిగిన టెండర్లలో కందుల ధర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.7,769, కనిష్ఠంగా రూ.7,619గా ధరలు నమోదయ్యాయి. ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యం ధర గరిష్ఠంగా రూ.2,609గా ఒకే ధర లభించింది. కందులు వంద బస్తాలు, వరి ధాన్యం వంద బస్తాలు అమ్మకానికి వచ్చింది.

డయల్ యువర్ ఆర్‌ఎంకు 23 వినతులు

స్టేషన్ మహబూబ్‌నగర్: డయల్ యువర్ ఆర్‌ఎంకు 23 వినతులు వచ్చిన ట్లు రీజినల్ మేనేజర్ సంతోష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం డయల్ యువర్ ఆర్‌ఎం నిర్వహించి ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. మహబూబ్‌నగర్–ఏనుగొండ, అప్పన్నపల్లి, ఎదిర, దివిటిపల్లి వరకు సిటీ బస్సులు నడపాలని, నాగర్‌కర్నూల్ నుంచి జడ్చర్ల వరకు పల్లె వెలుగు బస్సులు నడపాలని, దేవరకద్ర నుంచి కోయిలసాగర్ వరకు బస్సులు నడపాలని ప్రయాణికులు కోరారు. వనపర్తి నుంచి పెబ్బేర్ మీదుగా మల్లాయపల్లికు బస్సు నడపాలని, రాత్రి 8.30 గంటల సమయంలో మహబూబ్‌నగర్ నుంచి తాండూర్ రూట్లో బస్సు నడపాలని కోరారు. మహబూబ్‌నగర్ నుంచి గుల్బర్గ వరకు బస్సు, మరికల్ నుంచి మద్దూరు మీదుగా బూనేడు వరకు బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఖిల్లాఘనపురం: బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం ప్రతినిధులు సుమ, సలోని అన్నారు. శుక్రవారం మండలంలోని మానాజీపేట ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 'బేటీ బచావో–బేటీ పడావో' కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడారు. గ్రామాల్లో నేటికీ బాల్య వివాహాలు చేస్తూ వారి జీవితాలను నాశనం చేస్తున్నారని.. నియంత్రణకు కృషి చేయాలని కోరారు. అలాగే సైబర్ క్రైం, సఖి సేవలు, గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ తదితర అంశాల గురించి విద్యార్థులకు వివరించారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే సంప్రదించాల్సిన నంబర్లను తెలియజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీకాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రైతుల అభ్యున్నతి



మాట్లాడుతున్న వేముల శ్రీనివాస్‌రెడ్డి

ఆత్మకూర్: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రైతుల అభ్యున్నతి సాధ్యమని.. వారి కోసం ఒక్క ఏడాదిలో రూ.54 వేల కోట్లు ఖర్చు చేసిందని ఆ పార్టీ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని మాజీ సర్పంచ్ గంగాధర్‌గౌడ్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ తన పదేళ్ల పాలనలో రైతులను గాలికొదిలేసి.. ప్రస్తుతం ప్రభుత్వాన్ని నిందించడమే లక్ష్యంగా సాగుతోందని మండిపడ్డారు. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.2 లక్షల పంట రుణమాఫీ పూర్తి చేసి చూపించారన్నారు. ఏక కాలంలో 25 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్లు మాఫీ చేశామని.. సన్నరకం వరి ధాన్యానికి రూ.500 బోనస్ ఇచ్చిన ఘనత తమకే దక్కుతుందని చెప్పారు. రానున్న రోజుల్లో 20 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. సమావేశంలో నాయకులు విన్‌య్‌కుమార్‌రెడ్డి, మెకానిక్ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ



ప్రశంసాపత్రం అందుకుంటున్న అబ్దుల్ నబీ

కొత్తకోట: సీఎం కప్ జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీలో పట్టణానికి చెందిన విద్యార్థి ఎస్కే బాబా అజ్మీర్ వెండి పతకం సాధించారని మాస్టర్ అబ్దుల్ నబీ తెలిపారు. ఈ నెల 19న పాలమూరులోని మినీ ఇండోర్ స్టేడియంలో జరిగిన సీఎం కప్ బాక్సింగ్ పోటీల్లో అండర్ 14.. 48 కిలోల విభాగంలో గెలుపొందారని.. ముగింపు వేడుకల్లో కలెక్టర్ విజయేందిర, జాయింట్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ పతకం, ప్రశంసాపత్రం అందజేశారని వివరించారు. విద్యార్థిని డీవైఎస్‌ఓ శ్రీనివాసులు, కార్యదర్శి శారదాబాయి, సీనియర్ కోచ్ నర్సింహులు, అహ్మద్ తదితరులు అభినందించారు.

శుభ్రతతో రోగాలు దూరం



మాట్లాడుతున్న మండల వైద్యాధికారి డా. భవాని

మదనాపురం: విద్యార్థులు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని.. దీంతో రోగాలు దరి చేరవని మండల వైద్యాధికారి డా. భవాని సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మానసిక ఒత్తిడిని జయించడం, శుభ్రత, నెలసరి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాల గురించి క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకురాలు బీటీ రాణి, విజయ్, భారతమ్మ, ఆశా కార్యకర్త సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

తండాల్లో ఎక్సైజ్ దాడులు



కొన్నూర్‌తండాలో బెల్లం ఊట ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

అమరచింత: ఆత్మకూర్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని కొన్నూర్‌తండా, నెల్విడితండాలో శుక్రవారం డీటీఎఫ్ బృందంతో కలిసి దాడులు నిర్వహించి 20 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశామని ఎక్సైజ్ సీఐ శ్రావణ్‌కుమార్ తెలిపారు. పట్టుబడిన వ్యక్తిని అమరచింత తహసీల్దార్ రవికుమార్ ఎదుట హాజరుపర్చామని చెప్పారు. సారా తయారుచేసినా, విక్రయించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

'అమిత్‌షా బహిరంగ క్షమాపణ చెప్పాలి'



కొత్తకోట చౌరస్తాలో ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

సాక్షి నెట్‌వర్క్: డా. బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్ అన్నారు. శుక్రవారం కొత్తకోట చౌరస్తాలో సీఐటీయూ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కక్ష పూరిత రాజకీయాలు మానుకొని దేశ ప్రజలందరి ఎదుట బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాలచందర్, లక్ష్మయ్య, శివ, శ్రీను, కురుమన్న, పెద్దరాజు, మద్దిలేటి, నాని, కొండన్న, సుశీల, శిరీష, మణెమ్మ, సరళ తదితరులు పాల్గొన్నారు.

■ దళిత సంఘాల నాయకులు, ధర్మ సమాజ్ పార్టీ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వీరపాగ రామకృష్ణ , ఎల్లయ్య, జిల్లా నాయకులు చిన్నపాగ అశోక్, నత్తి సుధాకర్, కురుమన్న, ఎల్లస్వామి, గంధం నాగరాజు, రవి, మధు, సుధాకర్, మన్యం, ఆంజనేయులు, విజయ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

■ పాన్‌గల్, మండలం రేమద్దులలో కేవీపీఎస్, డీవైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ, సీఐటీయూ, గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. రేమద్దులలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు భగత్, బాల్యానాయక్, రాము, భీమయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

■ వీపనగండ్లలో పలు ప్రజాసంఘాల నాయకులు రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మురళి, నాయకులు సీహెచ్ వెంకటయ్య, ఆశన్న, వెంకటేశ్వర్లగౌడ్, నర్సింహ, నవీన్, జానీ, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

■ అమరచింతలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఏసీఈ శ్యాంసుందర్, అజయ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు, సీపీఎం మండల కార్యదర్శి జీఎస్ గోపి, నాయకులు వెంకటేశ్, ఆర్‌ఎన్ రమేష్ పాల్గొన్నారు.

■ మదనాపురంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రజాసంఘాల నాయకులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్రాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు చీర్ల ప్రసాద్, చిరంజీవి, మాసన్న, సత్యన్న, చెన్నయ్య, మణివర్ధన్, మొగిలి, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



పాన్‌గల్ మండలం రేమద్దులలో అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు



వనపర్తిలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ధర్మసమాజ్ పార్టీ నాయకులు